

కేంద్రం కనికరించలే!



బయ్యారంలోని ఇనుప ఖనిజం గుట్టలు

సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి

- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- ఊసులేని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్, కొత్త లైన్లు
- వరంగల్ సైనిక్ స్కూల్ విషయంలోనూ అదే తీరు
- గిరిజన విశ్వవిద్యాలయానికి పైసా విదల్చని కేంద్ర సర్కారు
- మేడారం జాతరకు జాతీయ హోదా ప్రకటన లేదు
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి

7



మూడో సారి కూడా కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన ఎన్డీఏ సర్కారు.. బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాపై ఏ మాత్రం కనికరం చూపలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎన్నికవడంతో ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురుస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయని ఆశపడ్డారు. ముఖ్యంగా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, కొత్త రైల్వేలైన్లు, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వరంగల్‌లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు అంశాలు కచ్చితంగా ఉంటాయని ఆశించారు. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలల కాలానికి గాను మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును చూసిన తర్వాత అందరూ నిరాశకు లోనయ్యారు. ఉమ్మడిజిల్లా వాసులు ఆశించిన వాటిలో ఏ ఒక్క అంశానికి సంబంధించి ఊసులేకపోవడం.. కేటాయింపులు లేకపోవడం.. ఏ పథకానికి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఒరిగిందేమీ లేదని, మళ్లీ మొండిచేయే చూపారని పెదవి విరుస్తున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి



బయ్యారం ఉక్కు.. డోర్నకల్ జంక్షన్.. ఊసేదీ?

'వికసిత్ భారత్' పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం తమ జిల్లాకు మొండిచేయి చూపిందని మహబూబాబాద్ జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఇక రాష్ట్ర విభజన హామీల్లో ఎంతో ప్రాధాన్యం కలిగిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఎలాంటి ప్రస్తావన చేయలేదని, ఉత్తర, దక్షిణ భారత రైలు మార్గాల నడుమ ఎంతో చరిత్ర కలిగిన అతిపురాతన డోర్నకల్ రైల్వేజంక్షన్ పునరుద్ధరణ అంశం ఊసేలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

8



పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో కళావతిబాయి



మానుకోట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కళావతిబాయి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 23 : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి పాఠశాల పరిసరాలు, వంట స్థలం, భోజనశాల, డార్మెటరీలు, బాత్రుములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ఆవరణ, పరిసరాలు, తరగతి గదులు, నిద్రించే గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అన్నం తినే సమయంలో దోమలు, ఈగలు వాలకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మిగిలిన అన్నం డస్ట్‌బిన్‌లో వేసి మునిసిపాలిటీ సిబ్బంది తీసుకువేళ్లే విధంగా చూడాలని వార్డెన్, ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. బాలికలు రుతుక్రమ పరిశుభ్రతను పాటించాలన్నారు. భోజనం, మలవిసర్జనకు ముందు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే యూపీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీసీహెచ్ ఎస్ మంగమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మంజుల, అనూష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 23 : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమున్న చోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేనిచోట తొలిప్రాధాన్యత ఇచ్చి, ఎక్కువమంది ఉన్నచోటు నుంచి సర్దుబాటు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఒక సెక్షన్ మాత్రమే ఉండి ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరూ లేదా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ పరిధిల ఉపాధ్యాయుల సమన్వయంతో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని, విద్యార్థులు లేని పాఠశాలల ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు పంపించాలన్నారు. సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు వెంటనే పాఠశాలల్లో జాయిన్ కావాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఎంఈవోలు పూల్‌చంద్, శ్రీదేవి, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఎస్వో అప్పారావు, ఏఎస్వో సంతోష్, సతీష్, ఉపాధ్యాయ సం ఘాల నాయకులు సంకా బద్రినారాయణ, మురళీకృష్ణ, శ్రీశైలం, లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

676 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 317 జీవో కింద జిల్లాలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలనకు తొలిరోజు 676 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో మ్యూమవల్, స్పౌజ్, మెడికల్ విభాగాల్లో అర్హులైన ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం ఇన్చార్జీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో 9 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో జరిగిన కేంద్రాలను డీఈవో రామారావు పరిశీలించారు.పరిశీలనకు వచ్చే ఉపాధ్యాయులు సదరు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లను పరిశీలించి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



చింతల్‌తండాలో శానిటేషన్‌ను మెరుగుపరచాలని అధికారులకు సూచిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

డోర్నకల్, జూలై 23 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, రాజుతండాలోని అంగన్‌వాడీ సెంటర్, చింతలతండాలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యాబోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనంతోపాటు తాగునీరు అందించాల న్నారు. స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిసిబ్బందిని ఆదేశించారు. రాజుతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. చిన్నారులకు మెనూప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం చింతల్‌తండాను సందర్శించి తండాలో శానిటేషన్ సక్రమంగా లేదని, వెంటనే ప్రత్యేకంగా కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో, తహసీల్దార్‌లను ఆదేశించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడేగా పాటించాలని సూచించారు. సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్‌తో డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వైద్యాధికారి సాద్విజా, ఎంపీవో మీర్జాఉస్మాన్‌బేగ్ ఉన్నారు.

కేసముద్రం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి పగుళ్లు

- భారీ శబ్దంతో బీటలుబారిన గోడలు
- ఆందోళన చెందిన ప్రజలు

కేసముద్రం, జూలై 23 : కేసముద్రం స్టేషన్ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం మంగళవారం అకస్మాత్తుగా భారీ శబ్దంతో బీటలు బారింది. ఉదయం ఒక్కసారిగా బాంబు పేలిన మాదిరిగా భారీ సౌండ్‌తో ఆలయం గోడలకు పగుళ్లు రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు ఏం జరుగుతుందో అర్థంకాక ఆందోళన చెందారు. ఆలయం సమీపంలో ఉన్నవారు ఘటన జరిగిన సమయంలో దూరంగా పరుగు తీశారు. కొద్దిసేపటి తర్వాత శబ్దంగాని, పగుళ్లగాని రాకపోవడంతో దగ్గరకు వెళ్లి పరిశీలించారు. ఆలయానికి ఉత్తరం, దక్షిణం వైపుల ఉన్నగోడలు బీటలుబారాయి. అయితే భారీశబ్దం వచ్చినప్పటికీ ఆలయంలో దీపం అలాగే వెలుగుతుండగా అడుగుభాగంలో ఎలాంటి పగుళ్లు లేకపోవడం అక్కడి వచ్చినవారిని ఆశ్చర్యానికి గురిచేసింది. పాత రాతి ఆలయంపై 12 ఏళ్ల క్రితం కొత్తగోపురం నిర్మించారు. ఇన్ని సంవత్సరాలు లేనిది ఇప్పుడు ఒకేసారి ఇలాకావడంతో ఎవరికీ అంతుపట్టకుండా ఉంది. ఆలయం వద్ద శబ్దంతో పాటు పగుళ్లరావడంతో చుట్టుపక్కల ఉన్న జనం, విషయం తెలుసుకున్న గ్రామస్థులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకొని ఆశ్చర్యంగా పరిశీలించారు. ఎస్సై మురళీధర్‌రాజ్ ఆలయం వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించి ప్రమాద భరితంగా ఉండడంతో గుడివైపు ఎవరూ వెళ్లవద్దని అక్కడి ఉన్న వారికి సూచించారు.



బీటలు బారిన వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం

పేకాట స్థావరాలపై దాడులు

- రూ.53, 800 నగదు, 11 సెల్‌ఫోన్లు, 5 బైకులు స్వాధీనం
- మానుకోట పోలీసుల అదుపులో ఆరుగురు, డోర్నకల్‌లో ఆరుగురు..

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్, జూలై 23 : జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. ఈ ఘటనలో 12 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.53,800 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, 5 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీసుధీర్‌రామ్‌నాథ్ కేకన్ వెల్లడించారు.

- మహబూబాబాద్ జిల్లా కేంద్రం పెరికభవన్ సమీపంలో ఉన్న ఓఇంట్లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో టౌన్ ఎస్సై విజయ్, సిబ్బంది కలిసి దాడులు చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.38 వేల నగదు, రెండు బైక్‌లు, ఐదు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారిలో ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.
- డోర్నకల్ మండలం చిల్కోడులోని ఓపేకాట స్థావరంపై ఎస్సై సంతోష్‌రావు సిబ్బంది తో కలిసి, దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.15,800 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, మూడుబైక్‌లను సీజ్ చేశారు. జిల్లాలో ఎక్కడ కూడా ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలపాలకు పాల్పడితే పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ మురళి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంకుమార్‌రెడ్డి



డాక్టర్ మురళి రాంకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 23 : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ చిలక మురళికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా కేఎంసీ ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ కాటం రామ్‌కుమార్‌రెడ్డికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ బదిలీపై ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా వెళ్లారు. దీంతో తాత్కాలికంగా ఎంజీఎం పరిపాలనతో పాటు చార్జి తీసుకునే విధంగా ప్రొఫెసర్ మురళికి బాధ్యతలు అప్పగించారు. ప్రొఫెసర్ మురళి 2012లో ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ఇక్కడే పదోన్నతులు పొందారు. ప్రస్తుతం కేఎంసీ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిపాలన అధికారిగా కూడా డాక్టర్ మురళి కొనసాగుతున్నారు.

అలాగే కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కాటం రామ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి హోదాలో నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ నర్సంపేట వైద్య కళాశాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే హనుమకొండలోని టీబీ అండ్‌చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సునీత నియామకం అయ్యారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి బృందం రెండు రోజుల్లో నగరంలోని పలు బోధన ఆస్పత్రులను తనిఖీ చేయనున్న నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలు సీనియర్ ప్రొఫెసర్లకు అప్పగించారు.



మానుకోట శివారు భట్టు అంజయ్యనగర్ కాలనీలో రోడ్డుపై నాటు వేస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు

రోడ్డుపై నాట్లు వేసి నిరసన

మహబూబాబాద్ రూరల్, జూలై 23 : జిల్లా కేంద్రం శివారు భట్టు అంజయ్యనగర్ కాలనీలో మంగళవారం ఎన్డీ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డుపై నాట్లువేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆరెల్లి కృష్ణ మాట్లాడారు. గత పది సంవత్సరాల క్రితం భట్టు అంజయ్య నగర్ కాలనీ నిర్మించామని, నేటికి ఆ కాలనీలో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, సైడు కాల్వల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలనీలో రోడ్లన్నీ బురదమయం కావడంతో మహిళలు రోడ్డుపై నాట్లు వేసి, నిరసన వ్యక్తంచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మదార్, శారద, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 23: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 26 వరకు మూడు రోజుల పాటు వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల నుంచి 26మంది మెయిన్ డ్రాకు అర్హత సాధించినట్లు తెలిపారు. సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్‌డబుల్స్ విభాగాల్లో మూడు రోజులు పాటు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో అర్హత సాధించిన వారితో కలిపి మొత్తం 146మంది క్రీడాకారులు మెయిన్ డ్రా పోటీలో పాల్గొంటారన్నారు. వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌తోపాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ టోర్నీలో 15మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు కిదాంబి నందగోపాల్, విద్యాధర్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి వసతులను కల్పించనున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కేరళలో జరగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. రమేష్‌కుమార్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ జితేందర్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, కోచ్‌లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ఆర్థిక సహాయం

కేయూ క్యాంపస్, జూలై 23: అనారోగ్యంతో బాధాపడుతున్న గణితశాస్త్ర అధ్యాపకుడు తాటిపాముల తిలక్‌కు గణితశాస్త్ర విభాగం మిత్రులు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందచేసి తమ సహృదయాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్‌కు చెందిన గణితశాస్త్ర ప్రైవేట్ అధ్యాపకుడు తిలక్ తల్లి ఇటీవల చనిపోవడం, తన తండ్రి తిలక్ 18వ ఏటనే చనిపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. దీనికి తోడు ఇటీవల తిలక్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కేయూ రిజిస్ట్రార్, గణితశాస్త్రవిభాగం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తోడ్పాటుతో గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నాగయ్య, సతీశ్, యాకూబ్ పాషాలు కలిసి మిత్రులతో కలిసి తిలక్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అలాగే మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు తిలక్ కుటుంబ పరిస్థితిని విన్నవించి ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. తిలక్ కుటుంబానికి కనీసం రేషన్ కార్డు లేదని, పేదరికంతో ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. తిలక్ ఆర్థిక సహాయం చేసిన వారిలో రమేశ్, నరేశ్, భాస్కర్, నరహరి, యుగేందర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను చూపి ఆదాయ పన్ను చెల్లించాలి

హనుమకొండ టౌన్, జూలై 23: వాస్తవాలను చూపి ఆదాయం పన్ను చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌కామ్ టాక్స్ రేంజ్-3 హైద్రాబాద్ ఎన్. సీతారామాంజనేయులు అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు, డ్రాయింగ్ ఆఫీసర్లు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, డీసీబీ, ఏపీజీవీబీ బ్యాంకు అధికారులకు ఆదాయపన్నుపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ.. సీఏల దగ్గర కొంత మంది ఆదాయపన్ను ఫైలింగ్ విధానం నేర్చుకొని నగదు రీఫండ్ వచ్చేలా తప్పుడు ఫైలింగ్ చేస్తున్నారని, అలా చేయడం వల్ల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. తిరిగి మరలా సవరించే వెసులుబాటు కల్పించామని, 2022-23 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం వడ్డీ, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 25 శాతం వడ్డీతో మరలా ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, జీఎంలు దేవేందర్, వేణుబాబు, సత్యనారాయణ, ఆదాయ పన్ను అధికారులు అవినాశ్, ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు డ్రాయింగ్ ఆఫీసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.



కేంద్రం కనికరించలే!

- సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి
- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి



హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ సర్కారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొండిచేయే చూపింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలలకాలానికి గాను మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ సారి రాష్ట్రం నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రానికి బడ్జెట్‌లో కేంద్రం పెద్ద పీట వేస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయనుకున్నారు. కానీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్న ఏ ఒక్క అంశమూ, పథకమూ లేకపోవడంతో అందరూ నిరాశకు గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఏం ఒరగలేదని ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటేదీ?

రాష్ట్రాల విభజన హామీలో ఒకటైన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కనిపించలేదు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఈ నాటిది కాదు. రెండు దశాబ్దాలుగా ఇది నలుగుతోంది. దీనిపై స్థానిక ప్రజలు ఎన్నో సార్లు ఆందోళన చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం చర్చకు వస్తుంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ అగ్రనేతలు సైతం తమ పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే బయ్యారం ఉక్కువ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ కూడా ఇచ్చారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి తిరిగి అధికారంలో రావడంతో ఉక్కు ఫ్యాక్టరీ కల నెరవేరుతుందని స్థానిక ప్రజలు ఎంతగానో ఆశించారు. కానీ బడ్జెట్‌లో ఈ అంశాన్నే ప్రస్తావించకపోవడంతో నిరాశకు లోనయ్యారు.

గిరిజన విశ్వవిద్యాలయం

ములుగులో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న గిరిజన విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ములుగు జిల్లా జాకారం వద్ద ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు గత సంవత్సరమే ప్రారంభమయ్యాయి. ఈవిద్యాసంవత్సరం నుంచే తరగతులు మొదలు కావలసి ఉండింది. జాకారంలోని వైటీసీ భవనంలో తాత్కాలికం గా తరగతులను నిర్వహించేందుకు సన్నాహాలు మొదల య్యాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటు పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించారు. దీని నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. కానీ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన మాత్రం బడ్జెట్‌లో చేయలేదు. దీనితో విశ్వవిద్యాలయం నిర్వహణపై నీలినీడలు పరుచుకున్నాయి. నిధులలేమి వల్ల విశ్వవిద్యాలయం పనుల పూర్తికి మరింత జాప్యం జరగవచ్చు.



కోచ్‌ఫ్యాక్టరీ ఏమైంది?

ఎంతో కాలంగా వరంగల్ ప్రజలు డిమాండ్ చేస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి ఈ సారి కూడా మోక్షం కలుగలేదు. కేంద్ర బడ్జెట్‌లో దీని ప్రస్తావనే లేదు. రెండు దశాబ్దాలుగా వరంగల్ ప్రజలు కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం ప్రధాన ఎజెండాగా నిలుస్తూ వచ్చింది. ఓటర్లను ఆకర్షించేందుకు కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రకటనలు చేయడం మినహా- ఇప్పటివరకు ఈ కల సాకారం కాలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు ఏర్పాటుతో సరిపెట్టింది. అయినప్పటికీ కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ ఇప్పటికీ సజీవంగానే ఉంది. దీంతో ప్రతీసారి బడ్జెట్‌లో ఈ ఫ్యాక్టరీ ప్రస్తావన ఉంటుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూడడం.. చివరకు నిరాశకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సారి కూడా అదే జరిగింది.

కాజీపేట రైల్వే డివిజన్ అంతే..

బడ్జెట్‌లో కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. ఉత్తర, దక్షిణభారత దేశాలను కలిపే అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన కాజీపేటను డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన చాలా ఏళ్లనాటిది. దీనిపై అనేకసార్లు పోరాటాలు కూడా జరిగాయి. డివిజన్ కేంద్రంగా మారిస్తే కాజీపేట జంక్షన్ రూపురేఖలు మారుతాయి. రవాణా, వ్యాపార, వాణిజ్యపరంగా ఈప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించడానికి కాజీపేట జంక్షన్‌కు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో డివిజన్ కల కలగానే మిగిలిపోయింది. ఈసారి బడ్జెట్‌లో కూడా ఆఊసే లేకపోవడంతో జిల్లా ప్రజలు ఉసూరుమంటున్నారు.

కొత్త రైల్వే లైన్లు..

వరంగల్ జిల్లాకు సంబంధించిన కొత్త రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు కూడా నిర్మలమ్మ బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాజీపేట మీదుగా కొన్ని రైల్వేలైన్ల డిమాండ్ చాలా కాలంగా ఉంది. వాటి ప్రస్తావన లేదు. కాజీపేట - భూపాలపల్లి రైల్వే, అలాగే రామగుండం - మణుగూరు వయా భూపాలపల్లి రైల్వేప్రతిపాదనలు వీటిలో కొన్ని. ఇందులో రామగుండం - మణుగూరు రైల్వే లైన్ సర్వేకు గత బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో వీటి ఊసేలేకపోవడంతో కేంద్రం రైల్వే ప్రాజెక్టుల విషయంలో మరోసారి మొండి చేయి చూపినట్లు అయింది.

సైనిక్ స్కూల్ ఏమైంది!

హనుమకొండ జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కానరాలేదు. జిల్లాకు సైనిక్ స్కూల్ మంజూరు గతంలోనే జరిగింది. మడికొండ సమీపంలో దీని ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన స్థలం కేటాయింపునకు గత ప్రభుత్వం ముందుకు వచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల సైనిక్‌స్కూల్ ఏర్పాటులో ఐదేళ్లగా జాప్యం జరుగుతోంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రధాన ప్రచార అంశంగా చర్చకు వచ్చింది. వరంగల్ ఎంపీగా గెలిచిన డాక్టర్ కావ్య సైతం ఈ అంశాన్ని లోక్‌సభలో చర్చిస్తానని చెప్పారు. దీనిపై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ అగ్రనేతలు సైనిక్ స్కూల్ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. తీరా బడ్జెట్‌లో చూస్తే ఆ ఊసే లేదు.

కాళేశ్వరానికి జాతీయ హోదా ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులలో ఏదైనా ఒకదానికి జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ దిశగా కేంద్రంతో చర్చించింది. అయినా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశం బడ్జెట్‌లో కనిపించలేదు.

విమానాశ్రయం ఊసేలేదు



ఉడాన్ పథకం కింద మామునూరులోని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలన్న అంశానికి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. ఉడాన్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలో భాగంగా మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణ అంశం చాలా ఏళ్ల నుంచి నలుగుతోంది. విమానాశ్రయాన్ని త్వరలో అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. సర్వేలు కూడా జరిగాయి. ఇందుకు అవసరమైన భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చింది. అయితే కేంద్ర విమానాయాన మంత్రిత్వ శాఖ ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బడ్జెట్‌లో ప్రతిపాదిస్తే అభివృద్ధికి ముందడుగుపడేది. కానీ ఈసారి బడ్జెట్‌లో ఆ అవకాశమే కల్పించలేదు.

అవీ ఇవీ..

మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కేంద్రం తన వంతుగా ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు పడిన ఆశ నిరాశే అయింది. ఈ పార్క్‌కు కేంద్రం తన వంతు వాటాగా రూ.500 కోట్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు అంశం కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన నియో రైతు ప్రాజెక్టుకు కేంద్రం తనవంతుగా సమకూర్చాల్సిన నిధుల ప్రస్తావన కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదు.



మేడారానికి జాతీయ పండుగ గుర్తింపు డిమాండ్‌ను పట్టించుకోలే..

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను జాతీయ పండుగగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్న డిమాండ్ కూడా చాలాకాలంగా జిల్లా ప్రజలు చేస్తున్నారు. మేడారం ఆసియాలోకెల్లా అతిపెద్ద జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరవుతుంటారు. చారిత్రకంగా, ఆదివాసీ సంప్రదాయంపరంగా విశిష్టత, ఔన్నత్యం ఉన్న ఈ జాతరను స్టేట్ ఫెస్టివల్‌గా గతంలోనే ప్రకటించినప్పటికీ నేషనల్ ఫెస్టివల్‌గా చేయాలన్న డిమాండ్‌ను జిల్లా ప్రజలు చాలా కాలంగా చేస్తున్నారు. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ ప్రధానంగా చర్చకు వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ఈ విషయంలో కేంద్రం వద్ద పరిశీలనలో ఉంది. ఈ యేడు ఫిబ్రవరిలో జాతర జరిగిన సందర్భంలో వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చిన బీజేపీ అగ్రనేతలు మేడారం జాతరను నేషనల్ ఫెస్టివల్‌గా ప్రకటించేలా కృషి చేస్తామని హామీలు గుప్పించారు. అప్పుడు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సైతం ఈ మేరకు వాగ్దానం చేశారు. కానీ దానిని ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించడం ద్వారా నెరవేర్చే దిశగా ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో జిల్లా ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు మరోసారి నిరాశకు గురయ్యారు.

ఇది 'కుర్సీ బచావో' బడ్జెట్

డాక్టర్ కడియం కావ్య, వరంగల్ ఎంపీ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'కుర్సీ బచావ్ బడ్జెట్. ఎన్డీఏ ప్రభుత్వం నిలబడడానికి బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు తాయిలాలు ఇచ్చింది. తమ కూటమిని నిలుపుకొనేందుకు బీజేపీ సంతృప్తివాద రాజకీయాలు అనుసరిస్తోంది. ఇదంతా బీజేపీ క్విడ్ ప్రోకో వ్యవస్థను నడుపుతున్నట్లు ఉంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఎలాంటి కేటాయింపులు లేకపోవడం బాధాకరం. గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడం లాంటివాటిపై పట్టింపేలేదు. తెలంగాణ పుట్టుకను ఇష్టపడని ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంపై వివక్ష చూపుతూనే ఉన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి మొండి చేయి చూపి.. వివక్షను కొనసాగించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ అన్యాయాన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నిస్తాం. రాష్ట్రానికి నిధుల కేటాంపులో జరిగిన వివక్షపై నిలదీస్తాం.

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఊసేలేదు

జంగా రాఘవరెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్



కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఊసే లేకపోవడం నిరాశకు గురిచేసింది. కేంద్ర సర్కారు జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా బడ్జెట్‌లో మాత్రం రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించకుండా నిరాశ మిగిల్చింది. ఈ బడ్జెట్‌లో బిహార్, ఏపీకి మాత్రమే నిధులు కేటాయించి పక్షపాతం చూపింది. రాష్ట్ర విభజనలో భాగంగా ఇచ్చిన 35 హామీలు, ములుగు గిరిజన యూనివర్సిటీకి అదనపు నిధులు, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాను తుంగలో తొక్కింది. ఇప్పుడు రాష్ట్రానికి చెందిన బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ఏముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతారు? రాబోయే ఎన్నికల్లో బీజేపీని బొందపెడతారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి..

నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రజలు బీజేపీకి చెందిన ఎనిమిది మందిని ఎంపీలను గెలిపించారు. కానీ కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు, వనరుల రూపంలోనూ మొండి చేయే చూపింది. దీనికి బాధ్యత వహిస్తూ ఆ ఎంపీలంతా వెంటనే రాజీనామా చేయాలి. బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటే వారిని కేంద్రం వంచించింది. ఇక ఓరుగల్లు జిల్లాకు సంబంధించిన విభజన హామీలను కేంద్రం విస్మరించింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, జంక్షన్, నాలగో రైల్వేలైన్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల విస్తరణ ఊసే లేదు. రాష్ట్రానికి నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. వారు ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

బొట్ల చక్రపాణి, సీపీఎం హనుమకొండ కార్యదర్శి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ప్రస్తావనే లేదు. బీజేపీ తన రాజకీయ మనుగడ కోసమే బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేసింది. దేశంలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారు. వేతన జీవుల ఆశలను అడియాశలు చేసింది. 40లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల ఎలా సాధ్యమవుతుంది. బాలింతలకు పౌష్టికాహారం అందించే పోషణ్ పథకం నిధులకు కోత పెట్టారు. దేశంలోని కార్పొరేట్ శక్తులకు పన్నులు వేయకుండా 20 లక్షలలోపు ఆదాయం ఉండే మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపారు.

రాష్ట్రానికిచ్చిన హామీలను మరిచారు..

తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపారు. విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రాష్ట్రానికి నిధులు రాబట్టలేక పోయిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన ప్రధాని కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించి తెలంగాణకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఊతం

జలగం రంజిత్‌రావు, బీజేపీ నాయకులు



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవా రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశం లోని యువతకు ఉపాధి అవకా శాలు మెరుగుపరుస్తూ ఉద్యోగావకాశాలకు ఊతమిచ్చే దిగా ఉంది. కేంద్ర బడ్జెట్ మహిళలు, యువతకు సాధికార త కల్పించే దిశగా అడుగులేసింది. భారతీయ ఆకాంక్ష లు, విశ్వాసానికి కేంద్ర బడ్జెట్ ప్రతిబింబంలా నిలిచింది. ప్రజా అనుకూల, అభివృద్ధి సానుకూల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి మార్గదర్శక బడ్జెట్‌ను ప్రవేశట్టి భారత్ అభివృద్ధికి బంగారు బాటలు వేశారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఎంప్లాయిమెంట్ బేస్డ్ స్కీమ్ ద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు బాటలు వేసింది. ముద్ర రుణాల పరిధిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలనుకునే యువతకు చేయూతనందించింది. ఎంఎస్ఎంఈలకు రుణాలను అందించే కొత్త పథకాన్ని ఈ బడ్జెట్‌లో పొందు పరిచారు. బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి, ప్లాటినంపై 6.4 శాతానికి తగ్గించడంతో బంగారు, వెండి, ప్లాటినం ఆభరణాల ధరలు తగ్గుతాయి. క్యాన్సర్ ఔషధాలు, ఎక్స్‌రే మిషన్లపై ట్యాక్స్ తగ్గించడం వైద్య రంగానికి అనుకూలంతో పాటు పేదలకు వైద్యం అందే అవకాశం ఉంది. బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేడయం హర్షణీయం.

బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్ఛరించలేదు

ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు



కేంద్రం.. బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్ఛరించలేదు. రాష్ట్రం నుంచి బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలున్నా రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమైనా నిధులు ప్రకటిస్తారని ఎదురు చూసిన ప్రజల నోట్లో ప్రధాని మోదీ మట్టికొట్టారు. రూ.48.21లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం బిహార్, ఆంధ్రప్రదేశ్‌కే పెద్దపీట వేశారు. తెలంగాణలోని పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుల ఊసేలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటే ఎత్తలేదు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, సంజయ్ ఏం చేస్తున్నారు? రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అవకాశం వచ్చినప్పుడు వాత పెట్టడం ఖాయం.

ఉద్యోగస్తులకు నిరాశను మిగిల్చింది

టీఆర్‌టీఎఫ్ జిల్లా చీఫ్ పాటర్న్ లకిరెడ్డి సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాసిరిరాజి బాపురావు





కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగస్తులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగస్తులను కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించింది. గత పదేళ్లుగా ఊరట కల్పిస్తారని ఎదురు చూస్తున్న ఉద్యోగులకు బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాది నిరాశనే మిగిల్చింది. భారీ ఊరట లభిస్తుందనుకున్న ఉద్యోగులకు ఎలాంటి ఊరట లభించలేదు. పాత పన్ను విధానంలో ఎలాంటి మినహాయింపు లేకుండా పోయింది. బడ్జెట్ ద్వారా కొత్త పన్ను విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

విద్యారంగానికి ప్రాధాన్యమేదీ?

డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు 1.26 లక్షల కోట్లు మాత్రమే. గత సంవత్సరం బడ్జెట్ 1.12 లక్షల కోట్లు కాగా ఈ సంవత్సరం కొంత మేర పెరిగినప్పటికీ ఇది మొత్తం బడ్జెట్‌లో 2.59 శాతమే. ఈ నిధులు ఏ మాత్రం విద్యాభివృద్ధికి సరిపోవు. బడ్జెట్‌లో విద్యకు కనీసం 6 శాతం కేటాయిస్తేనే విద్యాసంస్థలకు మౌలిక వసతులు కల్పించగలం, కొత్తగా ఉపాధ్యాయులను నియమించగలం, విద్యాప్రమాణాలు పెంచగలం. ఈ అరకొర నిధులతో వికసిత భారత్‌లో విద్యా వికాసం ఎండమావిలో నీటిని వెతికినట్లే ఉంటుంది. ఉద్యోగులపై ఆదాయ పన్ను విధానం కూడా మోసపూరితంగా ఉంది. పెద్దగా మార్పులేమీ లేవు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పన్ను మినహాయింపు.. కనీస ఆదాయం పెంచకపోవడం, సెక్షన్ 80సీ పరిమితి పెంచక పోవడం ఉద్యోగులను నిరాశపరిచింది.

రాష్ట్రానికి మొండిచేయి చూపారు..

సీహెచ్ రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్ర ఊసేలేదు. దేశంలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం బిహార్, అంధ్రప్రదేశ్ సీఎంలకు భయపడి పదవి కాపాడుకోవడానికి ఆయా రాష్ట్రాలకు బడ్జెట్లో పెద్ద పీట వేసింది. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి వెంటనే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలి. రాష్ట్ర ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



వికసిత్ భారత్ నిర్మాణమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరికి ఉపాధి, అంత్యోదయ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర బడ్జెట్ ఉంది. పేదలు, యువత, అన్నదాతలు, మహిళలు, పన్ను చెల్లింపుదారులకు మేలు కలిగించడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోంది.

వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

పీవీ నారాయణరావు, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఉంది. స్థిర ఆర్థిక వృద్ధి పెంపుదల, ఉద్యోగ అవకాశాలను పెంపొందించటంలాంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ద్రవ్యలోటును 4.9 శాతానికి అంటే.. జీడీపీపై 5 శాతం కిందకు తీసుకురావడం మంచి పరిణామం. రానున్న ఐదేళ్లలో 20 లక్షల నైపుణ్య యువతను తయారు చేయడం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకాల ప్రకటన, మరో 50 లక్షల ఉద్యోగ కల్పన ఒక శుభవార్త. మొబైల్స్, చార్జర్స్‌పై కస్టమ్ సుంకాన్ని తగ్గి తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. బంగారం, వెండిపై కూడా కస్టమ్ డ్యూటీ తగ్గించటంతో వాటి ధరల్లో మార్పు రావచ్చు.

ఇది మిశ్రమ బడ్జెట్

త్రిపురనేని గోపీచంద్, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్, హనుమకొండ



కేంద్ర 2024-25 వార్షిక బడ్జెట్ సామాన్య ప్రజలకు, రైతులకు, విద్య, వైద్య రంగాలకు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, రైతు, విమానాశ్రయాలు, జల రవాణా, పోర్టుల అభివృద్ధి, మహిళా అభ్యున్నతి లక్ష్యంగా ఉంది. 2045 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధన దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గృహనిర్మాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర వాటికి కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. ఆదాయపు పన్నులో ఉద్యోగ వర్గాలకు రూ.17,500 నుంచి తగ్గింపు ప్రామాణితను రూ.75వేలకు పెంచడం పన్ను స్లాబులలో మార్పు మంచి చర్య. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రాలను సమానంగా చూడకుండా బిహార్, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, ఈశాన్య ప్రాంతాలకు అధిక కేటాయింపులు జరిపి తెలంగాణకు మొండిచేయి చూపడం అత్యంత బాధాకరం.

అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ తొలగింపు

తిప్పర్తి రాఘవ రెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసివేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీనివల్ల ఆస్తిని విక్రయించే చాలామంది ఇప్పుడు కొనుగోలు ధరను పెంచలేరు. వారి మూల ధరను తగ్గించలేరు. ప్రకటనకు ముందు ఆస్తి విక్రయం ద్వారా ఉత్పన్నమయ్యే దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనంలో 20 శాతం పన్ను విధింపబడింది. ఇప్పుడు బడ్జెట్ ప్రకారం ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా కొత్త ఎల్‌టీసీజీ పన్నురేటు 12.5 శాతం ఆస్తిపన్నుపై మూల ధన లాభాలకు వర్తిస్తుంది.

విద్యారంగానికి నిధులు విస్మరించారు


కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత భారత్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులను విస్మరించింది. గత ఏడాది బడ్జెట్‌లో 2.61 శాతం నిధులను కేటాయించిన ఇదే కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం 2.59 శాతం నిధులను మాత్రమే కేటాయించింది. 1964లో కొఠారి కమిషన్, 1980లో జాతీయ విద్యావిధానం, 2020లో నూతన జాతీయ విద్యా విధానం బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులను కేటాయించాలని స్పష్టం చేసినా అవేమీ పట్టించుకోలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన నిధులతో విద్యార్థులకు నైపుణ్య ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం సాధ్యపడదు. ఈ నిధులతో కొత్తగా విద్యాసంస్థలను ఏర్పాటుచేసి మరిన్ని విద్యావకాశాలను కల్పించేందుకు అస్కారం లేదు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ


పెండెం రాజు, యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రూ.48లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల బడ్జెట్‌లో ఉద్యోగులకు దక్కిందేమీ లేదు. ఏడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతీసారి ఉగ్యోగులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. కనీసం 80సీ పరిమితిని కూడా పెంచలేదు. పాత పన్నుల విధానంలోనే కొత్త స్లాబులను మార్చారు. దీంతో ఉద్యోగస్తులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మెజారిటీ ఉద్యోగులు పాత పన్ను విధానంలోనే ఆదాయపు పన్నును చెల్లిస్తున్నారు. పన్ను చెల్లింపుదారులందరినీ ఎలాంటి లాభంలేని కొత్త పన్ను విధానంవైపు మళ్లించే విధంగా ప్రస్తుత బడ్జెట్ ఉంది.

ఓరుగల్లుకు అన్యాయం చేశారు..

రావుల శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేశారు. కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ లాంటి వాటి ఊసే లేదు. ఈ బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరుగుతాయని ఆశించాం. కానీ నిరాశే మిగిలింది. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా నిధులు కేటాయించకపోవడం వివక్షే. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఏ ఒక్క కేటాయింపు జరగలేదు.

బయ్యారం ఉక్కు.. డోర్నకల్ జంక్షన్.. ఊసేదీ?



- కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలకు దక్కని ప్రాధాన్యం

మహబూబాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : 'వికసిత్ భారత్' పేరుతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు మొండిచేయి చూపిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర విభజన హామీల్లో ప్రాధాన్యత గల బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ బయ్యారం ఉక్కు పరిశ్రమలపై కాలం వెల్లదీశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బయ్యారం ఉక్కు పరిశ్రమల ప్రస్తావలేకపో వడంతో జిల్లాలో నిరసనలు వ్యక్తమవున్నాయి.

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ అభివర్ణిస్తూ 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గిరిజన ప్రాబల్య జిల్లాకు మొండిచేయి చూపింది. ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రకటించిన ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా మహబూబాబాద్ జిల్లాకు ఒడ్డింపులు ఏమి కన్పించలేదు. మధ్య తరగతి, మధ్య ఎగువ తరగతికి ఊరటనిచ్చేలా ఆదాయ పన్నులపై మినహాయింపులపై కొందరు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికి మిగతా అంశాల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేకంగా ఒరిగిందేమి లేదని విప క్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పోరాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించాక కూడా మహబూబాబాద్ జిల్లా అభివృద్ధిని విస్మరించింది. తెలుగు రాష్ట్రాల విభజన చట్టంలో పొందు పరిచిన సుమారు 20వేల మందికి ఉపాధి లభించే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేకుండాపోవడాన్ని నిరు ద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఉత్తర, దక్షిణ భారత రైలు మార్గాల నడుమ ఎంతో చరిత్ర కలిగిన అతిపురాతన డోర్నకల్ రైల్వేజంక్షన్ పునరుద్ధరణ ఆశలపై కేంద్రం నీళ్లు చల్లినట్లయింది.

రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ జిల్లాకు ఒక్క అంశాన్ని కూడ కేంద్రం పరిగణలోకి తీసుకోకపోవడాన్ని ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. మొత్తానికి 18 మండలాలతో కూడిన మహబూబాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా కేంద్ర బడ్జెట్‌లో ఒరిగిందేమి లేదని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర నిరాశనిస్పృహాలకు లోనవుతున్నారు.

బడ్జెట్ కేటాయింపులో ఒరిగిందేమీలేదు?

- బి.విజయసారథి, సీపీఐ జిల్లా కార్యదర్శి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ప్రజ లు ఏనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో ఒరిగిందేమి లేదు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రాతినిధ్యం ఉన్నప్పటికి నిధులు రాబట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. విభజన చట్టంలోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యా రం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, ములుగు గిరిజన యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు లేవు. కేంద్ర బడ్జెట్ తెలంగాణ ప్రజలను పూర్తిగా నిరాశ పర్చింది.

అంకెల గారడీ తో మభ్యపెట్టిన కేంద్రం

- కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి



లోకసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలా గారడిలా దేశ ప్రజలను మభ్యపరిచే విధంగా ఉంది. ప్రధాని మోదీ మూడవ సారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యత తగ్గి, తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం మిత్రపక్షాలకుకేటాయింపులు చేసిన విధంగా ఉంది. ఆహార ఉత్పత్తులకు పన్నులు పెంచి విలాస వస్తు వులకు పన్ను రాయితీ ఇచ్చారు. వ్యవసాయ రంగానికి కేటా యింపులు తగినంతగా లేక పోవడం బాధకరం. రూ.48.21 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్ పేద, సామన్య మధ్య తరగతి ప్రయోజనం చేకూరే పథకాలేమి లేవు.

మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా 'సిరికొండ'



భూపాలపల్లిటౌన్, జూలై 23 : శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా సిరికొండ మధుసూదనాచారిని ఎంపికయ్యారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. తెలంగాణ తొలిమాజీ స్పీకర్‌గా మధుసూదనాచారి కొనసాగారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో సమావేశం జరి గింది. ఈ సందర్భంగా మధుసూదనాచారిని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా ఎంపిక చేశారు. బీఆర్ఎస్‌లో సిరికొండ బలమైన నేతగా కొన సాగుతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తన మార్కును చాటుకుం టున్నారు. ఆయన ఎంపిక పట్ల పార్టీ నియోజవర్గ ముఖ్యనేతలు చింతల రమేష్, బండారి రవి, గోపు బిక్షపతి, లెంకల రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో నేలవంచవాసి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

గూడూరు, జూలై 23 : మట్టేవాడ శివారు నేలవంచకు చెందిన మూతి శ్రీనివాస్ (40) గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ రూరల్ జిల్లా కాల్వపూర్ రైల్వే స్టేషన్‌పరిధి సోమవారం రాత్రిమృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మూతి శ్రీనివాస్ మానసిక పరిస్థితి బాగోలేదు. మే 18న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబసభ్యులు అన్నిచోట్ల వెతికారు. జూలై 12న గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి రైలు దారా వెళ్లాడు. సోమవారం అక్కడ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అహ్మదాబాద్ రూరల్ జిల్లా బావుల్లా పోలీస్‌స్టేషన్ నుంచి వరుసగా సోదరుడైన మూతి బద్రికి ఫోన్‌చేసి శ్రీనివాస్ మృతి చెందినట్లుగా అక్కడి పోలీసులు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు మూతి పాపారావు, రమేష్, సదిలు గుజరాత్‌కు బయలు దేరి వెళ్లారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

చిన్నగూడూరు, జూలై 23 : జూన్ 28లోపు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది, ఇంత వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్ట్ 5 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చిన్నగూడూరు ఉగ్గంపల్లి క్లస్టర్ ఏఈవో విష్ణు తెలిపారు. గతంలో నమోదు చేసుకున్నవారు మార్పులు చేర్పులు ఉంటే జూలై 30లోపు సరిచేసుకోవాలన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులే రైతుబీమాకు అర్హులని తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఇనుగుర్తి, జూలై 23 : తారాసింగ్‌తండా పంచాయతీ పరిధిలోని బావోజీ తండాలో మంగళవారం కేసముద్రం ఎస్సై మురళీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గుడుంబా కాసినా, విక్రయించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


వెంకమ్మ (ఫైల్)

ఇనుగుర్తి, జూలై 23 : మండలంలోని కోమటిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు నిమ్మల వెంకమ్మ (102) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. వందేళ్ల పైబడిన వెంకమ్మకు నాలుగుతరాల వారసులను చూసింది. వెంకమ్మ మృతితో కోమటిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి కుమారుడు నిమ్మల బిక్షం, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు పాల్గొని వెంకమ్మ అంతిమయాత్ర నిర్వహించారు.

ఫొటో గ్రాఫర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక


కుర్న నగేష్ అధ్యక్షుడు

కేసముద్రం, జూలై 23 : మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని స్థానిక లక్ష్మీ సాయి గార్డెన్స్‌లో మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా కుర్న నగేష్, కోశాధికారిగా బొల్లు సంపత్, ప్రధాన కార్యదర్శిగా చందు దామోదర్, ఉపాధ్యక్షుడిగా ఎండి.రజాక్‌ను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు మడుపు సత్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధా న కార్యదర్శి బోమోజు వెంకన్నచారి, గంగుల యాదగిరి, అనుమాస కుమార్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఈఈగా భీమ్లా

మహబూబాబాద్ టౌన్, జూలై 23 : జిల్లా రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గాబి.భీమ్లాను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన మంగళవారంఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడ పనిచేస్తున్న తానేశ్వర్‌ను సత్తుపల్లికి బదిలీ చేయగా, వేయిటింగ్‌లో ఉన్న భీమ్లాను ఇక్కడికి బదిలీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్లో డే


ఎల్లో డేలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్ సులోచన, ఆర్పీలు

మహబూబాబాద్ టౌన్, జూలై 23 : పట్టణంలోని బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఎల్లో డేను నిర్వహించారు. అమ్మబాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్లో డేను చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ గుండు సులోచన, ఆర్పీలు శైలజ, వినోదతో పాటు అంగన్‌వాడీ ప్రీస్కూల్ చిన్నారులంతా ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి హాజరయ్యారు. పిల్లలకు రంగులపై అవగాహన కల్పించేందుకు ఎల్లో డేను నిర్వహించి రంగులపై చిన్నారులకు అవగాహన కల్పించినట్లు చెప్పా రు. ఆకుపచ్చరంగు డ్రాయింగ్ షీట్‌లపై అక్షరాలు రాసి చిన్నారులకు తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలను నేర్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, స్వరూప, సాయమ్మ పాల్గొన్నారు.

తొర్రూరు నుంచి నల్లగొండకు బస్సు

తొర్రూరు, జూలై 23: తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి నల్గొండ జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 24వ తేదీ నుంచి తొర్రూరు నుంచి ఉదయం 6గంటలకు బస్సు బయలుదేరి తిరుమలగిరి, మోత్కూర్, నార్కట్‌పల్లి మీదుగా నల్గొండకు వెళ్తుందన్నారు. తిరిగి నల్గొండ నుంచి 11 గంటలకు బయలుదేరి తొర్రూరుకు వస్తుందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి కోసం పోరాటం

- సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర రావు

తొర్రూరు, జూలై 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర రావు అన్నారు. మంగళవారం పార్టీ పిలుపుమేరకు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, మండల సమగ్ర అభివృద్ధి చేపట్టాలన్నారు. మునిసిపాలిటీల పరిధిలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తొర్రూరు పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి ఈనెల 31న చేపట్టనున్న కలెక్టరేట్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్, కిరణ్, లక్ష్మణ్, వెంకన్న, యాకయ్య భిక్షపతి, మల్లయ్య పాల్గొన్నారు.


గాంధీ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



పీఏసీఎస్‌లో వసూళ్ల దందా?!

- సిబిల్ స్కోర్, ఇతర ఖర్చుల పేరుతో ఒక్కోరైతు నుంచి రూ.2,850 వసూళ్లు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

నర్సింహులపేట, జులై 23 : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంటే, దానిని ఆసరా చేసుకున్న కొందరు అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. పంట రుణాలు మాఫీ అయిన రైతుల నుంచి నర్సింహులపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సిబిల్ స్కోర్, ఏడునెలల వడ్డీతో పాటు ఇతర ఖర్చుల కోసం అంటూ ఒక్కో రైతు నుంచి రూ. 2,850 వసూలు చేయడంతో బాధిత రైతులు లబోదిబోమంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలో 22 జీపీల పరిధిలో 1,492 మంది రైతులకు రూ.రెండులక్షల లోపు రుణాలు మంజూరయ్యాయి. దీనిలో మరిపెడ డీసీసీ బ్యాంకు పరిధిలో సుమారు 500లకు పైచిలుకు రైతులకు రుణాలు మాఫీ అయినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. దీనిని ఆసరా చేసుకున్న పీఏసీఎస్ అధికారులు రూ.50 వేల రుణం మాఫీ అయిన రైతుకు డిసెంబరు 10 నుంచి ఇప్పటి వరకు ఏడు మాసాలకు వడ్డీ కింద రూ. 2,050, ఇతర ఖర్చులకు రూ.500, సిబిల్ స్కోర్ కింద రూ. 300 చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నట్లు రామన్నగూడెం, ముంగిమడుగు, పెద్దనాగారం, కొమ్ములవంచ, జయపురం గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

హైస్కూల్లో డీఈవో తనిఖీ

కేసముద్రం, జూలై 23 : కల్వల జడ్పీహైస్కూల్‌ను డీఈవో రామారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. ఒక విద్యార్థినితో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పేరును తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రాయించి భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించారు. బాసర ట్రిపుల్‌ఐటీకి మండలంలో ఒకేఒక్క విద్యార్థిని కోయగూరి హారిణి ఈ పాఠశాల నుంచే ఎంపిక కావడంతో ఉపాధ్యాయులను అభినందించారు. ఆయన వెంట నెల్లికుదురు, మహబూబాబాద్ ఎంఈవోలు గుగులోత్ రాము, బి.పూల్‌చంద్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తండ సదానందం, పీఎస్ హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి, బి.బాలశౌరెడ్డి, రాగి భిక్షపతి, మార్గం శ్రీనివాస్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 398 ఎరువుల దుకాణాల్లో లక్ష్యాలకు అనుగుణంగా ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని, నిత్యం ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఆన్‌లైన్' పోర్టల్ ద్వారా ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు. రైతు రుణమాఫీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగించాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత బ్యాంకు, సహకార, రెవెన్యూ అధికారులను సమన్వయ పరుస్తూ రైతు రుణమాఫీ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంటలను ప్రోత్సహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన జిల్లా లక్ష్యం 4 వేల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 630 ఎకరాలు ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని, పంట మార్పిడి విధానం ద్వార రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అధిక లాభాలు వస్తాయని, అందుకు గాను రైతులకు ఆయిల్‌పామ్ పంటలపై అవహన కల్పించాలన్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతినిత్యం ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తుండాలని, తద్వారా నకిలీ ఎరువులు, విత్తనాలు ఉత్పత్తి కాకుండా ఉంటుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు, ఉద్యానవనశాఖ అధికారి మరియన్న, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

- నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్

మరిపెడ రూరల్, జూలై23 : రైతులు నాణ్యమైన విత్తనాలు వేసినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చని నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం లచ్యా తండా జీపీ పరిధిలోని విత్తన దుకాణాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రైతులందరూ ఒకేచోట విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసి రశీదు పొందాలన్నారు. రైతులకు ఎల్లవేళలా నాబార్డ్ సహకారం ఉంటుందన్నారు. ఏవో వీరాసింగ్, సీఈవో నరేందర్, పాలకవర్గ సభ్యులు లక్ష్మణ్, రెడ్డి, దేవిదాస్, రాములమ్మ, రాంకుమార్, కీమా, జామ, రమేష్, బాలాజీ, బాలు, రైతులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది తీరు మార్చుకోవాలి

- మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు

గార్ల జూలై 23 : మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి విధులు నిర్వహించే ఉద్యోగులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక సివిల్ ఆస్పత్రిని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి విచ్చేసిన ఆమె పలువార్డుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఉపయోగించే టాయిలెట్స్, బాత్‌రూంల్లో నీటి సరఫరా రావడంలేదని సిబ్బంది మందలించి, విటిని సరిచేయించాలని ఆదేశించారు. చుట్టపుచూపుగా విధులకు వచ్చే సిబ్బందిపై రాత్రి సమయాల్లో తనిఖీ చేయాలని తహసీల్దార్ కె.రవీందర్‌ను కోరారు. అనంతరం ఉద్యోగుల హాజరు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్డీవో వెంట డీఎల్‌పీవో హరిప్రసాద్, ఎంపీవో రజిని డాక్టర్ హనుమంతరావు ఉన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- మల్యాల వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త క్రాంతికుమార్

గార్ల, జూలై 23 : అధిక వర్షాల వల్ల జాలునేలల్లో సాగుచేసిన పత్తి రైతులు సకాలంలో పంటపై సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి మల్యాల వ్యవసాయ క్షేత్రంశాస్త్రవేత్త క్రాంతి కుమార్ సూచించారు. మంగళవారం మర్రిగూడెం తండాలో వర్షంలో నీట మునిగిన పత్తి పంటలను వారు సందర్శించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల మూలంగా పత్తి పంటలు ఊట పట్టి ఎర్రగా మారే ప్రమాదం ఉందని విటికి తక్షణం సరైన మోతాదులో మందులు పిచికారి చేస్తేపైరులు ఏపుగా పేరుగుదల వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏవో కావటి రామారావు, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్


డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

బయ్యారం, జూలై 23 : తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లను బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ'లో చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలనితెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అన్నారు. బయ్యారంలో మంగళవారం సంఘం నాయకులు ప్రదర్శన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన ప్రాధాన్యత లేకపోవడంతో రాష్ట్ర జనాభాలో 14 శాతం జనాభా కలిగిన ముదిరాజ్‌ల జీవనశైలి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, ఉపాధ్యక్షుడు మారబోయిన రాంభద్రం, నాయకులు విష్ణు, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, కరుణాకర్, వీరభద్రం, బిక్షం, భగవాన్, నరేష్, అర్జున్, శ్రీను, యర్రయ్య, వీన్న పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలి

డోర్నకల్, జూలై 23 : ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మునిసిపల్ వైస్ చైర్మన్ కె.కోటిలింగం అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. హెచ్‌ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు కమల, రవికుమార్, వెంకటేశ్వర్లు, మునిసిపల్ ఫ్లోర్ కౌన్సిలర్ సురేందర్‌జైన్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల జూలై 23 : మర్రిగూడెంతండాలో మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి, 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. రహస్య సమాచారం మేరకు తండాలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి సారాను స్వాధీనం చేసుకొని, విక్రయదారులను అదుపులోకి తీసుకొన్నామన్నారు. వారి నుంచి రవాణాకు సిద్ధం చేసిన మోటార్ సైకిల్ సైతం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'

మహబూబాబాద్ టౌన్, జూలై 23 : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల లింగయ్య కోరారు. జిల్లా కేంద్రం శివారు గుమ్మూనూర్ అంబేద్కర్ భవన్‌లో మంగళవారం పి.రాములు అధ్యక్షతన సంఘం మహబూబాబాద్ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వెంకటయ్య, శంకరయ్య, పోషయ్య, జార్జ్, మల్లయ్య, యాదగిరి, వెంకటరత్నం, వివేకానంద, రంగాచారి, పాల్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

మహబూబాబాద్ రూరల్, జూలై 23 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు అన్నారు. మహబూబాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో నర్మద, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, ఎంపీవో హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లే అవుట్ లేని ప్లాట్లను కొనవద్దు

కేసముద్రం, జూలై 23 : కేసముద్రం స్టేషన్ గ్రామపంచాయతీ పరిధిలో లే అవుట్‌లేని ప్లాట్లను ఎవరూ కొనుగోలు, అమ్మకాలు చేయవద్దని హెచ్చరిస్తూ మంగళవారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లేని ప్లాట్ల క్రయ విక్రయాలు నిర్వహిస్తే పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ గ్రామప్రత్యేకాధికారి, తహసీల్దార్ దామోదర్, కార్య దర్శి అశోక్‌కుమార్ పేరిట ఈ ఫ్లెక్సీలను పలుచోట్ల ఏర్పాటు చేశారు.

కులగణన చేసి బీసీలను ఆదుకోవాలి

గూడూరు, జూలై 23 : కులగణన చేపట్టి బీసీలను ఆదుకోవాలని బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంపంగి జంపయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తహసీల్దార్ శ్వేతకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ఎన్నికల సభలో ప్రకటించిన విధంగా బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు 24 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ ప్రక్రియను తయారు చేసి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకుల సమస్యలను పరిష్కరించాలి

కురవి, జూలై 23 : కురవి ఆశ్రమ గురుకులంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు మాలోతు కిషన్ డిమాండ్ చేశారు. కురవిలోని హాస్టల్లో మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇరుకు గదుల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారని, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇటీవల నూతనంగా నిర్మించిన భవనంలో అన్ని సౌకర్యాలు పూర్తి చేయాలని కోరారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బానోత్ దేవానాయక్, రాజా, కట్ల కృష్ణ పాల్గొన్నారు.

బదిలీపై వస్తున్న జీపీ కార్యదర్శి మాకొద్దు

దంతాలపల్లి, జూలై 23 : గతంలో ఇక్కడ పని చేసి తిరిగి మండల కేంద్రానికి బదిలీపై వస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకన్న మాకొద్దంటూ మంగళవారం తాజా మాజీ సర్పంచ్ దర్శనాల సుష్మిత రవీందర్, తాజా మాజీ ఎంపీటీసీ యాకయ్య, గ్రామస్థులు ఎంపీడీవో వివేక్రమ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆయనపై పలు ఆరోపణాలున్నాయన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పొన్నోటి బాలాజీ, నెల్లురు రవి, వాసు, సుతారపు కిష్టయ్య పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, జూలై 23 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషినల్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మంగళవారం ఆయన మరిపెడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చేఓపీ, ఇన్‌పేషెంట్ల రికార్డులను పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసీ రిజిష్టర్లను చెక్ చేశారు. మెడికల్ ఆఫీసర్ రవి, మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై పీఎస్‌లో ఫిర్యాదు

బయ్యారం, జూలై 23 : దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితసబర్వాల్‌పైచట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నాయకులు వెంకటేశ్వర్లు, సహదేవుడు, నాగమణి, వీరస్వామి, రవీందర్, స్వరూప, నరేష్, బావ్‌సింగ్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓ ఐఏఎస్ అధికారి అయి ఉండి ఐఏఎస్‌లో వికలాంగులకు రిజర్వేషన్లు అవసరమా..? అంటూ అవమానపరిచే విధంగా మాట్లాడటం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. వికలాంగుల ఆత్మగౌరవం దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో..

- నెహ్రూసెంటర్ : దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరిచిన స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెర్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల వీరయ్య మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు స్మితసబర్వాల్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. చలగోల వెంకన్న, ఎండి.పాషా, సహదేవుడు, కొండ వెంకటేశ్వర్లు, కాసమల్ల వీరస్వామి, చెడుపాక ఉప్పలయ్య, జేరిపోతుల నారాయణ పాల్గొన్నారు.

యశ్వంత్‌కు అభినందనలు

మరిపెడ, జూలై 23 : ఉల్లెపల్లి రెవెన్యూ పరిధి భూక్యాతండాకు చెందిన మౌంటెనర్ భూక్యా యశ్వంత్‌ను మిజోరం గవర్నర్ హరిబాబు, డీజీపీ అనిల్‌సుక్లా మంగళవారం అభినందించారు. యశ్వంత్ వారిని మర్యాదపూర్వకంగా కలువగా ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. యశ్వంత్ కొంత కాలంగా ఖార్డింగులా, ఎవరెస్ట్ బేస్, కిలిమంజారో, ఎల్బ్రస్ వంటి భయంకరమైన ఎత్తైన పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని చేరుకోవాలనే యశ్వంత్ ఆకాంక్ష తప్పక నెరవేరాలన్నారు.